31లోగా ఆస్తిపన్ను చెల్లించాలి

జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీవత్స

90 శాతంతో వడ్డీ మాఫీ

బేగంపేట్, మార్చి 14: ఆస్తిపన్ను చెల్లించే వారికి జీహెచ్‌ఎంసీ భారీ నజరానా ప్రకటించింది. రెండు మూడేళ్లుగా ఆస్తిపన్ను చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్ నగదుకు ప్రతి నెల 2 శాతం చొప్పున వడ్డీ పడుతూ వస్తుంది. ఇలా పెండింగ్‌లో ఉన్న ట్యాక్స్ వడ్డీలో 90 శాతం డిస్కౌంట్ ఆఫర్‌ను ప్రకటించారు. ఈ నెల 31లోగా చెల్లించే వారికి ఈ ఆఫర్ వర్తిస్తుందని అధికారులు తెలిపారు. గురువారం జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీవత్స, బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్యతో కలిసి ట్యాక్స్ విభాగం అధికారులు ఆస్తి పన్ను ఎలా తీసుకోవాలి ఏయే వాటికి తొంభై శాతం డిస్కౌంట్ వర్తిస్తుంది అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీవత్స, బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్యలు మాట్లాడుతూ...సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్నవి, ప్రస్తుత సంవత్సరం కలిపి రూ. 108 కోట్లు టార్గెట్ ఉండగా, ప్రస్తుతం రూ.75 కోట్ల వరకు ట్యాక్స్ వసూలు అయిందన్నారు. ఇంకా రూ. 33 కోట్లు వసూలు కావల్సి ఉందని తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బేగంపేట్ సర్కిల్ కార్యాలయంలో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీవత్స, బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కిడ్నీ అవగాహన కార్యక్రమంలో జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్లు ఎం.రాజారావు, రమేశ్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్, మార్చి 14 : ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా గురువారం గాంధీ దవాఖానలోని నెఫ్రాలజీ (మూత్రపిండాలు) విభాగం ఆధ్వర్యంలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. గాంధీ దవాఖాన సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎం.రాజారావు, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రమేశ్‌రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య అధికమవుతున్నదన్నారు. శరీరంలోని మలినాలు, ఇతర ప్రమాదకరమైన వ్యర్థాలను మూత్రం ద్వారా బయటకు పంపే కిడ్నీలు (మూత్ర పిండాలు) బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందన్నారు. నిర్లక్ష్యం చేస్తే డయలసిస్, కిడ్నీ మార్పిడికి దారితీస్తుందని గుర్తించాలన్నారు. ఆహార నియమాలలో జాగ్రత్త వహించాలన్నారు. ఈ శిబిరంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ మంజూల, వైద్యులు డాక్టర్ విక్రమ్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాస్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

లోప్రెషర్ లేకుండా చూడండి

అంబర్‌పేట, మార్చి 14: గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్‌లో వారం రోజులుగా మంచినీరు లోప్రెషర్‌తో సరఫరా అవుతుందని బస్తీవాసులు వాపోతున్నారు. కాలనీలో గల ఇండ్లల్లో మొదటి అంతస్తు వరకు కూడా మంచినీరు సులభంగా సరఫరా అయ్యేదని, వారం రోజుల నుంచి ఆ పరిస్థితి లేదన్నారు. అధికారులు స్పందించి జైస్వాల్ గార్డెన్‌లో లోప్రెషర్ సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఆంజనేయస్వామికి మహాకుంభ సంప్రోక్షణ

వేడుకల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, మార్చి 14 : ఏండ్ల చరిత్ర ఉన్న సనత్‌నగర్ పారిశ్రామికవాడలోని శ్రీ పబ్బా ఆంజనేయస్వామి వారికి మహాకుంభ సంప్రోక్షణ ఘనంగా జరిగింది. శతాధిక ప్రతిష్ఠాచార్య చలమచర్ల వేణుగోపాలాచార్యుల పర్యవేక్షణలో రెండు రోజులుగా విశేష పూజలు జరుగుతున్నాయి. గురువారం జరిగిన మహాకుంభ సంప్రోక్షణకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ పబ్బా ఆంజనేయస్వామి ఆలయానికి మహాకుంభ సంప్రోక్షణతో పూర్వ వైభవం సిద్ధిస్తుందన్నారు. ఈ దేవాలయ అభివృద్ధికి తన పూరి సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా శతాధిక ప్రతిష్ఠాచార్య చలమచర్ల వేణుగోపాలాచార్యులు ఎమ్మెల్యే తలసానికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ వేడుకల్లో జరిగిన విశేష పూజల్లో కార్పొరేటర్ దంపతులు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, శ్రీ పబ్బా ఆంజనేయస్వామి, పోచమ్మ తల్లి, వాసవీ మాతాలయ నిర్మాణ ట్రస్ట్ ప్రతినిధులు ఉప్పల యాదగిరి, ఆకూరి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో..మానసిక ఉల్లాసం

జింఖానా మైదానంలో సికింద్రాబాద్ పార్లమెంట్ మహిళా క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శ్రీ గణేష్

కంటోన్మెంట్, మార్చి 14: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'ఖేలో తెలంగాణ-జీతో తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా గురువారం జింఖానా మైదానంలో అటల్ బీహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ మహిళా క్రీడల పోటీలను శ్రీ గణేష్‌తో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలను ప్రారంభించి కాసేపు క్రీడాకారుల ఆటలను తిలకించారు.

సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు, యువతరం టెక్నాలజీ వైపు దూసుకెళ్తున్న తరుణంలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందడంతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఏబీవీ ఫౌండేషన్ అధ్యక్షురాలు కావ్య కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపుమేరకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మహిళలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమన్వయంతో..

ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 14: ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి ఆలంబనగా నిలిచేందుకు తోడ్పడేలా ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. 1.6 ఎకరాల్లో రెండు అంతస్తుల్లో 9821.24 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.10.16 కోట్ల నిధులతో భవన నిర్మాణానికి అధికారులు గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అనేక రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్న ఎంతోమంది మహనీయులను అందించిన ఓయూ మరో మైలురాయిని దాటిందన్నారు. వర్సిటీ సర్వతోముఖాభివృద్ధి చెందే లక్ష్యంతో ఫౌండేషన్ పనిచేయనుందని చెప్పారు. వర్సిటీకి, పూర్వ విద్యార్థులకు మధ్య వారధిగా నిలుస్తుందని పేర్కొన్నారు. వీసీ నేతృత్వంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కార్యకలాపాలు నిర్వర్తిస్తుందని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులను భాగస్వాములు చేస్తూ వర్సిటీ అభివృద్ధికి నిధులు సమకూర్చనుందన్నారు. ఈ నిధులతో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల కల్పన తదితర కార్యకలాపాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ఓయూ సీఏబీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్, ఉస్మానియా ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ దేవరకొండ విజయ్‌కుమార్, డాక్టర్ గన్నవరపు శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ ఆదం సంతోష్‌కుమార్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆదం సంతోష్‌కుమార్

అడ్డగుట్ట, మార్చి 14 : సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు కోట్ల నిధులు మంజూరైనట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ ఆదం సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం తుకారాంగేట్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఒక్కొక్కటిగా గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తుందన్నారు. అంతేకాకుండా నియోజకవర్గాల వారీగా అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఐదు కోట్లను మంజూరు చేశారని ఆయన తెలియజేశారు. నియోజకవర్గంలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనిల్‌కుమార్, అమర్‌నాథ్, శిల్పాచారి, గుంటి కృష్ణ, గంటా రాజు సాగర్, మంజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు వేసే విధంగా చైతన్యం తేవాలి

విద్యార్థులకు ఓటరు సంకల్ప పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అమీర్‌పేట్, మార్చి 14: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచే దిశగా జీహెచ్‌ఎంసీ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఓటరు సంకల్ప పత్రాల పంపిణీ జరుగుతోంది. అమీర్‌పేట్‌లోని కన్యా గురుకుల్ పాఠశాల, అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఈ పత్రాలను పంపిణీ చేశారు. అమీర్‌పేట్ శ్రీ గణేష్ మహిళా సమాఖ్య ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు రోజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఈ పత్రాలను అందజేస్తూ.. తమ తల్లిదండ్రులు తప్పకుండా ఓటు వేసేవిధంగా వారిలో చైతన్యం తీసుకురావాలని రోజారెడ్డి విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ఆర్పీ పుష్పలత, జీహెచ్‌ఎంసీ యూసీడీ సీవో యాకయ్య, బీఆర్ఎస్ నాయకులు గొలుసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ

విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేస్తున్న హెచ్‌ఎం కోటేశ్వర రావు

బన్సీలాల్‌పేట్, మార్చి 14 : బోయిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం హాల్ టికెట్లను హెడ్ మాస్టర్ కోటేశ్వర రావు అందజేశారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలన పాటించి, విద్యార్థులందరూ మంచి మార్కులతో పాస్ కావాలని అన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదిగి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తమ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. జర్నలిస్టు విజే.శేషగిరి రావు విద్యార్థులకు పెన్‌లు అందజేసి, అభినందనలు తెలిపారు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి, చిత్రంలో వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ

అడ్డగుట్ట/మారేడ్‌పల్లి, మార్చి 14 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్డగుట్టలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో ఎమ్‌వీ ఫౌండేషన్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్‌వీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్ వెంకట్‌రెడ్డి, అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలు చైతన్యవంతులైనప్పుడే వారి హక్కులను పొందగలుగుతారన్నారు.ఈ కార్యక్రమంలో తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఎమ్‌వీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ స్వామి, సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, జమున, నర్సింగ్‌రావు, సుమలత, రామలీల, ఎమ్‌వీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్లు ఎ.సువర్ణ, భాగ్య, లావణ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ

సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని ఇంటి నుంచే అన్ని రంగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ స్వామి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వైఎస్ఏ అధ్యక్షులు జయకర్ డేనియల్, వేణుగోపాల్ స్వామి సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ వైఎంసీఏ హాల్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ స్వామి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలోనూ మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో సెంటినరీ బ్యాపిస్టు చర్చి మాజీ అధ్యక్షులు రాబర్ట్ సూర్యప్రకాశ్, వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి లినార్డ్ మైరిన్ పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి షెనాయ్ క్రీడా మైదానంలో..

మారేడ్‌పల్లి షెనాయ్ క్రీడా మైదానంలో స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బీజేపీ నాయకుడు శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు ఆయన బహుమతులను అందజేశారు. అనంతరం శ్రీ గణేష్ మాట్లాడుతూ...మహిళలందరూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ అధ్యక్షుడు పిట్ల నాగేష్ ముదిరాజ్, డివిజన్ ప్రెసిడెంట్ మాలతి, జనరల్ సెక్రటరీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చల్-మనోహరాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య గూడ్స్ రైలు వెళ్లే క్రమంలో ఓ వ్యక్తి దానికింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని పోలీసులు వెల్లడించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ ఫోన్ దొంగల అరెస్టు

మారేడ్‌పల్లి, మార్చి 14:జల్సాలకు అలవాటు పడి మొబైల్ ఫోన్లు చోరీ చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరు నిందితులను గోపాలపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడకు చెందిన సోహైల్ , డబీర్‌పురాకు చెంది న షేక్ హఫీజ్ ఉద్దీన్‌లు ఇద్దరు స్నేహితులు. ఈ నెల 10న సినీ కో డైరెక్టర్‌గా పని చేసే జీ. రాజమౌళి పని నిమిత్తం చిక్కడపల్లి నుంచి జూబ్లీహిల్స్‌లోని మరో స్నేహితుడిని కలిసేందుకు... వెళ్తున్న క్రమంలో సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్ ప్రాంతంలోని బ్లూసీ హోటల్ వద్ద బైక్‌పై వచ్చిన నిందితులు ఆయన చేతిలోని మొబైల్ ఫోన్ లాక్కుని పోయారు. వెంటనే జీ. రాజమౌళి గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించారు. బుధవారం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కానిస్టేబుళ్లు రవి, ఇస్మాయిల్ అహ్మద్‌లు నిందితుల బైక్‌లను నిలిపి విచారించగా సరైన సమాధానం చెప్పలేదు. వెంటనే వారి ని అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా ఫోన్ స్నాచి ంగ్ చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 3 మొబైల్ ఫోన్లు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జవహర్‌నగర్ అభివృద్ధికి కృషి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి మంజూరైన రూ. 39లక్ష లనిధుల మంజూరు ఉత్తర్వుల పత్రాలను గురువారం కార్పొరేషన్ కాంగ్రె స్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో వజ్రేశ్‌యాదవ్ అందజేశారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, మార్చి 14:పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాగూడ-మౌలాలి రైల్వే స్టేషన్ల మధ్య గురువారం ఉదయం 7:30 గంటలకు ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల అరెస్ట్

అడ్డగుట్ట, మార్చి 14 : సెల్‌ఫోన్ కోసం ఓ వ్యక్తిని హత్య చేసిన నలుగురు నిందితులను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ వివరాలు వెల్లడించారు. నంద్యాల మండలం అలవకొండ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ గౌడ్ సికింద్రాబాద్‌లోని ఎస్ఆర్ హాస్టల్‌లో ఉంటూ చర్లపల్లిలోని ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 7న కాచిగూడలో తన స్నేహితుడు నవీన్‌ను అనిల్‌కుమార్‌గౌడ్ కలిశాడు. అనంతరం అనిల్‌కుమార్‌గౌడ్ అక్కడి నుంచి రేపల్లె రైలు ఎక్కి డోర్ దగ్గర నిలబడి సికింద్రాబాద్‌కు ఫోను చూసుకుంటూ వస్తున్న క్రమంలో వారాసిగూడ దగ్గరలో మహ్మద్‌గూడకు చెందిన సంకు రాహుల్, సూరజ్‌కుమార్,దూద్‌బావికి చెందిన రవితేజ, చింతకుంట ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణలతో పాటు ఓ కుర్రాడు అనిల్‌కుమార్ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను కర్రతో కొట్టడంతో అది కిందపడిపోయింది. దీంతో సెల్‌ఫోన్ తీసుకున్న సదరు వ్యక్తుల వద్దకు వెళ్లి తన ఫోన్ ఇవ్వాలని అనిల్‌కుమార్ అడుగుతుండగా రాహుల్ అనే యువకుడు అనిల్ గుండెపై కత్తితో పొడిచాడు. అనిల్ అక్కడే మృతిచెందాడు. అది గమనించిన సదరు నిందితులు అనిల్‌కుమార్ మృతదేహాన్ని చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న డంపింగ్ యార్డు వద్ద పడేశారు. మరుసటి రోజు మృతదేహాన్ని గమనించిన స్థానికులు చిలకలగూడ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి ఒంటిపై కత్తిపోటు ఉండడంతో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. దర్యాప్తులో భాగంగా చిలకలగూడ చౌరస్తా నుంచి రైల్వేక్వార్టర్స్ వరకు ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే మృతుడి వివరాలు తెలువకపోవడంతో వివిధ సోషల్ మీడియాల ద్వారా హత్య వివరాలను ప్రచారం చేశారు. దీంతో కర్నూలులో ఉన్న మృతుడి బంధువులు ఆ వీడియో చూసి అనిల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వెంటనే చిలకలగూడ పోలీసులను ఆశ్రయించి చనిపోయింది తమ కుమారుడేనని తెలిపారు. ఆ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్, డీఐ రమేష్ గౌడ్‌తో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్

అభినందనలు..సన్మానం

పండుగలు శాంతియుతంగా జరిగేలా పోలీసులు కృషి చేస్తున్నారని సనత్‌నగర్ పీఎస్ శాంతి సంఘం అధ్యక్షులు గంట మల్లేష్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అయోధ్యలోని బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన, గుడ్ ఫ్రైడే కార్యక్రమాలు, శివరాత్రి, ఇప్పుడు తాజాగా రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో సనత్‌నగర్ పీఎస్ పరిధిలో ఎక్కడా ఎటువంటి ఘటనలకు తావు లేకుండా కృషి చేస్తున్న సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురందర్‌రెడ్డి, ఎస్ఐలు కృష్ణగౌడ్, సుశీల, హరీష్‌లను గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాంతి సంఘం ఉపాధ్యక్షులు మహ్మద్ సర్దార్, జె.నర్సింగ్‌రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.- అమీర్‌పేట్, మార్చి 14: